



## గజదొంగ

"ఒరేయ్ కిషన్!"

"ఏం?"

"ఏమయిందో తెలుసా!"

"ఏమయింది?"

"ఆదొంగ అలాగే పట్టపగలు వచ్చాడురా?"

"ఓహో!"

"వచ్చి ఎవ్వరికీ తెలియకుండా మామిడితోటలోకి చొరబడ్డాడురా!"

"ఓహోహో?"

"చొరబడి దొంగతనంగా మామిడి చెట్టెక్కి పోయేడురా!"

"ఆహా!"

"మామిడిచెట్టుకాయలుకోసి సంచీలో పోసుకుని దిగిపోయాడురా!"

"ఆహాహా!"

"దిగిపోయి బ్రహ్మదేవుడికి కూడా అవుపించకుండా ఉడాయించాడురా!"

"అమ్మయ్యో! ఎవడ్రా అంత ఘనమైన గజదొంగ?"

"నీకు ఆ దొంగెవరో తెలుసుకోవాలనుందా?"

"మరేమి టనుకున్నావ్!"

"ఒకవేళ ఆ దొంగెవరో తెలుస్తే నీవేం చేద్దామని?"

"పోలీసువారికి రిపోర్టుచేసి శ్రీ కృష్ణ జన్మ స్థానానికి పంపిస్తా!"

"ఏతే ఇంతకీ చెప్పమన్నావా?"

"చెప్పరా!"

"చెప్తే నన్నేమీ అనవుగదా!"

"వెర్రి వాడా! నిన్నేమంటాను? ఆ దొంగ డొక్క చీల్చి నక్కలకు పెడతా!"

"మీ నాన్నేనురా!"

"ఆఁ!......"

బులుసు-జీ-ప్రకాష్.

## విభక్తపు సోదరులవలె...

ఆఊళ్ళో వాసయోగ్యమగు ఇళ్ళు చాల తక్కువ. అద్దెకొంపలకు ఆశించేవారు నరకంలో పడినట్లు బాధపడాలి. ధనాశా పీడితులైన ఇళ్ల కామందులకు దాక్షిణ్యమనేది లేనేలేదు. ఆఫీసరు హోదాలోవున్న ఉద్యోగిహెచ్చు అద్దె ఇస్తానని ఎరచూపితే అంతకుపూర్వము నివసించే అద్దె యింటియజమానుని ఆ యింటి కామందు పిలచి "తక్షణం మీరు ఇల్లు కాళీ చెయ్యాలి" అని ఉత్తరవు జారీచేయుట పరిపాటైంది. ఈ ఆజ్ఞ ఆ గృహస్తునిపై బ్రహ్మస్త్రము వలె పడగానే అతడు చచ్చినంత కలగా చేడంటే నమ్మతగ్గ విషయమే.

ఒకనాడు......ఒక మర్యాదస్తుడైన ఇంటి యజమాని:— (అద్దెకున్న యింటి యజమానితో) అయ్యా! మీరు చాల ఉత్తములు. అందుచేతనే ఊళ్లో ఇళ్ళ అద్దెలు పెరిగినను నేను అద్దె యిప్పటివరకు హెచ్చించలేదు. గాని ఇప్పుడు ఇల్లు మాస్వంత వాడుకకు కావాలి. కాబట్టి దయచేసి వారము దినములలో ఇళ్ళు కాళీ అయేట్లు చేయండి. మీకు మాకు వైరమువద్దు. మనము ఎల్లప్పుడు ఏకోదర సోదరుల వలె యుందాం. ●

అద్దెకుండెడు ఇంటి యజమాని:— అన్నగారూ! చాల సంతోషము. ఏకోదర సోదరులవలె యున్న మనకు పిత్రార్జితమైన యీ యింటియందు హిందూలా ప్రకారము సమానహక్కు చేకూరునని వూహిస్తాను. ఇటుపైని తమ కోరిక ప్రకారము ఇల్లును విభక్తపు సోదరులవలె రెండు సమాన వాటాలుగా భాగించుకుందాం. మీవాటా కాళీచేయుటకు వారందినములు గడువుయిస్తే చాలును.

మరువాడ సూర్యప్రకాశం.

* * *

## నోటు

ఆన 1950 వ సంవత్సరం ఫిబ్రవరి 18 వ తేదీన బొండుజిల్లా కారేపల్లి తాలూకా పిండుపిల్లికాపురస్తులు శనగా బుచ్చమ్మగారి ముత్తాత మూడో సంబంధం మనుముడు కందిపప్పు రంగన్న గారికి, శొంఠిజిల్లా, కారేతాలూకా తడ గ్రామ కాపురస్తుడు బొమ్మ బండి సచ్చిత కృష్ణ అనంద విశాల శర్మ వ్రాయించి ఇచ్చిన ప్రాంశరీ నోటు:—

నేను, నాఅవసరం నిమిత్తం అనగా నా షష్టి పూర్తి ఉత్సవ సందర్భాన మీవద్ద అప్పుగా పుచ్చుకొన్న మూడువీశెల మైదాపిండి, అర్ధశేరు శెనగలు, యిందుకు సొమ్ము ముట్టేవరకు నెలకి, వీశ వకటికి అరగిద్దెడు ఆమందం చొప్పున అయ్యే అసలీ ఫాయిదాల మొత్తం అడిగినప్పుడు అవసరాన్నిబట్టి మీకుగాని మీ చనిపోయిన అమ్మమ్మ పెంపుడు కుమారుడు అచ్చయ్యకు గాని ఇచ్చి నా నోటు నేను తీసికొనగలవాడను.

బొమ్మబండి సచ్చిదానంద విశాలశర్మ,

ఇంర్నుకు సాక్షులు కావాలా?

"గాం"